# ఆగమనం

గోదావరి తూర్పు తీరంలో బయలుదేరిన బస్సు గంటలో అటవీ ప్రాంతంలో ప్రవేశించింది. కిటికీ పక్కనే కూర్చున్న రఘుపతి కళ్లింతింతలు చేసుకుని అడవి సౌందర్యాన్ని అవలోకించసాగేడు.

బస్సు మారేడుమిల్లిలో ఆగగానే బస్సులో ఉన్న పది పదిహేనుమందీ దిగి ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోయారు. రఘుపతి స్థిమితంగా దిగేడు.

ఊరంతా చీకటి అలుముకుంది.

పక్కనే ఉన్న సిగరెట్ బంకులో అడిగితే ఊళ్లో లాడ్జెస్‌లాంటివేం లేవని తెల్సింది. దగ్గర్లోనే కొండపై నొకటి, కొండ కింద ఒకటీ గెస్టుహవుసులున్నాయని, వాచ్‌మేన్ ఉంటాడు వెళ్లి ప్రయత్నించమని చెప్పి దారి చూపించేడు.

ఎంత రాత్రైనా గంగవరం చేరుకోగలననుకున్నాడు. అది సాధ్యంకాదని తెలిసి పోయింది. రోడ్డు దిగి కాలిబాటన కంచెదాటి గెస్టు హౌసు వేపు నడిచేడు.

వాచ్‌మేన్ కాబోలు బల్లమీద ముణగదీసుకుని పడుకుని ఉన్నాడు. తల దగ్గర స్టూలు మీద హరికేను దీపం వెలుగుతోంది

రఘుపతి మెట్లెక్కి వరండాలోకొచ్చాడు. మనిషి అలికిడికి ఆదాటున లేచి కూర్చున్నాడు వాచ్‌మేన్. రఘుపతినీ, చేతిలోని సూట్‌కేస్‌ని పరికించి చూసి ఆఫీసరెవరూ కాదని ఓ నిర్ణయానికి వచ్చి "ఎవరది?"అని గద్దించేడు.

విషయం వివరించేడు రఘుపతి.

"ఈలుకాదు, బావూ, ఇది ఆపీసర్ల గెస్టవుసు బంగ్లా, పైనించి ఆడ్డరు తెచ్చుకోవాల. ఆనక నాకు మాటొత్తాది" అన్నాడు.

రఘుపతి ఆలోచనలో పడ్డాడు.

ఇప్పుడెక్కడికెళ్లాలి?...

మౌనంగా వెనక్కి తిరగబోతూండగా, ఏమనుకున్నాడో ఏమో వాచ్‌మేన్ "సలికాలం, ఇంత రాత్రేళ ఎవరూ రారనుకోండే. ఒకేళ ఒత్తే తమరు ఎంటనే కాళీ సెయ్యాల, తవరికి మాత్రం ఉప్పుడెక్కడ బస దొరుకుద్ది పాపం!" అన్నాడు. "సేనా జాగర్త బావూ, సదుంకున్నోరని ఇత్తన్నాను" అన్నాడు తాళం తీస్తూ.

అప్పుడే కరెంటు వచ్చినట్టుంది.

వరండాలో ట్యూబులైటు వెలగనా మాననా అన్నట్టు అదేపనిగా కొట్టుకుంటోంది.

వాచ్‌మేన్ గదిలోకొచ్చి స్విచ్చివేశాడు. లేత పసుపురంగు లైటు గదంతా పరుచుకుంది.

"ఓల్టేజీ లేదుగదా, టూబులైట్లు ఎలగవ్" అని సంజాయిషీ ఇచ్చేడు వాచ్‌మేన్.

గదిలో మంచం, దానిమీద ఇక్ష్వాకుల కాలం నాటి పీచుపరుపు దర్శనమిచ్చాయి.

"ఈ డబ్బులు పట్టుకెళ్లి నాలుగరటిపళ్లు తెచ్చి పెట్టగలవా" అని అడిగాడు రఘుపతి.

వాచ్‌మేన్ వెళ్లగానే బాత్‌రూంలోకి వెళ్లి వణుకు తెప్పిస్తూన్న చల్లటి నీళ్లతో ముఖం, కాళ్లూ చేతులూ కడుక్కుని వచ్చి, లుంగీలోకి మారేడు. సూట్‌కేసులోని దుప్పటి తీసి పరుపు దులిపి పక్కవేశాడు.

వాచ్‌మేన్ అరటిపళ్లు తెచ్చి బల్లమీద పెట్టాడు.

రఘుపతి రెండరటిపళ్లు తిన్నాడు.

వాచ్‌మేన్ బయటికి వెళ్ళి ఎండిన ఆకులు చితుకులు పోగుచేసి వాకిట్లో మంట వేసేడు.

"రాండి, సలిమంట కాగుతారా"అంటూ రఘుపతిని పిలిచాడు.

ప్రకృతి వీక్షణ పారవశ్యంలో మరుగునపడిన ఆలోచనలు మంటలోంచి ఎగుస్తున్న నిప్పురవ్వల్లాగే ఎగసిపడడం ప్రారంభించాయి.

సరిగ్గా పదేళ్లయింది తను తల్లిని చూసి, ఎందుకంతగా తెగిపోయిందా రక్తసంబంధం?

చిన్నప్పుడు తను ఎప్పుడూ తల్లికొంగు వదలకుండా పట్టుకుని తిరుగుతుండేవాడు. చలి కాలంలో ఇలాగేచలి మంటవేసి కాపి, వేడి వేడి పాలు తాపించి పడుకోబెట్టేది తల్లి.

చెల్లికన్నా తనంటేనే ప్రాణంగా చూసేది. తండ్రి లేనిలోటు తెలీనీకుండా ఎలా పెంచుకొచ్చింది. రెక్కలు ముక్కలు చేసుకునేది. తనని డాక్టరుగా చూడాలని ఎన్ని కలలుకంది.

కానీ తనేం చేసేడు?

ఫైనలియర్ పరీక్షలముందు సునీతని పెళ్లి చేసుకున్నాడు. తప్పనిసరి పరిస్థితులలా తోసుకొచ్చేయని ఎంత నచ్చచెప్పినా నమ్మలేదు తల్లి. సునీత ఇద్దరు బిడ్డలున్న విడో అని

తెలిసేక గిరుక్కున ఇంట్లోకెళ్లి తలుపేసుకుంది. "ఇంకెప్పుడూ నీ మొహం నాకు చూపించకు" అంది.

సునీతనీ, ఆమె బిడ్డల్నీ కాపాడాలనే తపనతో, తల్లి మంచితనం మీద వున్న నమ్మకంతో తల్లికి చెప్పకుండా పెళ్లి చేసుకున్నాడు. తనేం చేసినా తల్లి కాదనదనే ధైర్యం.

అప్పటికే సునీత భర్త వైద్యం కోసం చేసిన అప్పుల్లో మునిగివుంది. తల్లినడిగి సునీతనీ పిల్లల్నీ తీసుకొచ్చి ఆమె దగ్గర వదిలేసి వెళ్లి తను ఫైనలియర్ రాయాలనీ, ఆపై ఉద్యోగం వచ్చేక అందర్నీ తన వెంట తీసుకెళ్లాలని తన ప్లాన్.

అంతా అస్తవ్యస్తమైంది. తను చెప్పేది వినకుండా తల్లి తలుపేసుకోవడం చూసి తనకీ పౌరుషమొచ్చింది.

"సరే, ఇకపై నా మొహం నీకు చూపించన్లే" అని వెనక్కి తిరిగి వాకిట్లోంచే వెళ్లిపోయాడు.

అది మొదలు - మీదపడిన కుటుంబ భారం, అప్పుల బరువు, ఆగిపోయిన చదువు; ఎక్కడెక్కడో తిరిగాడు, ఏమేమో చేశాడు.

చిన్నప్పుడు తన కాలికి ఎదురుదెబ్బ తగిలితే విలవిలలాడిపోయి గాయం మానే వరకూరోజా కంటనీరు పెట్టుకునే తల్లి, ఎప్పుడైనా తను అలిగి అన్నం మానేస్తే ఉపవాసం ఉండే తల్లి, తనని కంటికి రెప్పలా కాపాడి పెంచిన తల్లి కోపంలో ఓ మాటంటే మాత్రం ఇన్నేళ్లుగా ఆ తల్లి నుంచి దూరమై ఆమెనింత ఆరడిపెట్టాలా?

ఎంత మూర్ఖుడు తను! జీవితంలో క్రమంగా ఒక గొప్ప దుఃఖం, ఒంటరితనం ఆవరించుకోగా ఇలా బయలుదేరాడు.

పదేళ్లుగా గుండెపొరల అట్టడుగున దాగిన అశాంతి వెల్లువై పెల్లుబికి ప్రవహిస్తోంది. ఎప్పుడెప్పుడు తల్లిని చూద్దామా అన్పిస్తోంది. ఇంత దగ్గర్లోకి వచ్చాక ఇలా నిర్బంధంలో లాగ ఉండిపోవడం తట్టుకోలేనంత అసహనంగా ఉంది.

"అయ్‌గారు, మంటారిపోయి సేనాసేపైంది, ఇంకెళ్లి పడుకోండి" అంటున్నాడు వాచ్‌మేన్.

పడుకుంటే మాత్రం నిద్రపడుతుందా తనకి? గతపు తలపులు వెల్లువెత్తుతున్నాయి-

సునీత భర్త కృష్ణ ఉద్యమాల్లో రహస్యంగా పాల్గొనేవాడని తనకి చూచాయగా తెలుసు. తన మెడికో ఫ్రెండ్ శేషగిరికి ఫ్రెండతను. ఇంజనీరింగ్ డిగ్రీ చేసి ఉద్యోగంలో నిలదొక్కుకుంటున్న సమయంలో కృష్ణ మనసెందుకో అటు మళ్లిపోయింది. విషయం తెలిసిన సునీత నిస్సహాయంగా ఉండి పోవడం తప్ప ఏమీ చెయ్యలేకపోయింది.

ఓ రోజు ఉన్నట్టుండి కృష్ణ ఎక్కడో గాయపడి, ఎలాగో తప్పించుకొని ఇంటికి చేరుకున్నాడు. కబురు తెలిసి శేషగిరీ, తనూ వెళ్లారు. తొడలో గాయం తగిలి చాన్నాళ్లైనట్టుంది. అప్పటికే సెప్టిక్కై కుళ్లడం మొదలుపెట్టింది.

హాస్పిటల్లో ఎడ్మిట్ కావడానికి అతనొప్పుకోలేదు. బలవంతంగా తీసుకెళ్లి జాయిన్ చేసే ధైర్యం తమకిలేదు.

కృష్ణ హెరిడిటరీ షుగర్ పేషంటు. శేషగిరీ, తనూ ఫైనలియర్ పరిజ్ఞానంతో ఏవేవో మందులు యాంటీబయాటిక్స్ వాడుతూ ఉండేవారు.

ఇంట్లోకి బియ్యం, కూరలూ కొనుక్కొచ్చి సునీతకిచ్చేపని తనమీద పెట్టాడు శేషగిరి. అలా సునీతతో పరిచయం పెరిగింది.

హైస్కూలు చదువు కూడా పూర్తి చెయ్యని సునీతకి ప్రపంచం గురించి చాలా తక్కువ తెలుసు. ఇల్లు పిల్లలే తన ప్రపంచం అన్నట్టుండేది. కృష్ణ ఎంత ప్రమాదంలో ఉన్నాడో మొదట ఆమెకి అర్థం కాలేదు. అర్థమయ్యాక ఆమె కళ్లల్లో అంతులేని భయం గూడుకట్టుకుని కన్పించేది.

ఓ రాత్రి నిద్రలో కృష్ణ కన్నుమూసే సరికి పెద్ద వాడికి మూడేళ్లు, చిన్నవాడికి ఏడాదిన్నర.

శేషగిరి చెప్పేడు - అనాధాశ్రమంలో పెరిగిన సునీతని పెళ్లాడ్డం వలన కృష్ణని తల్లిదండ్రులూ, తోడబుట్టినవాళ్ళూ ఎవాయిడ్ చేశారని, టెలిగ్రాములిచ్చినా ఎవరూ రాలేదు.

ఇక అన్నీ తామే అయి శేషగిరీ, తనూ నిలబడాల్సి వచ్చింది. అంతా ముగిశాక కుమిలికుమిలి ఏడుస్తున్న సునీతకు గుడ్‌బై చెప్పేసి వెళ్లిపోవడం శేషగిరిలాగా తనవల్ల కాలేదు.

ఏదో ఆవేశం, ధైర్యం, తెగింపు ఆవహించగా సునీత మెడలో మూడుముళ్ళూ వేసేశాడు.

ముఖ్యంగా ఊళ్లో ఆడవాళ్లందరికీ కష్టానికీ సుఖానికీ తనే అయి ఆదుకునే తల్లి ఆనందించి తనని మెచ్చుకుని అభినందిస్తుందనుకున్నాడు. ఆ రోజు ఆమె ఎందుకంత కోపం తెచ్చుకుందో, ఆ విమెన్ సైకాలజీ ఏమిటో ఈనాటికీ తనకి అంతుపట్టలేదు.

ఎంత రాత్రైందో తెలీదు. ప్రకృతి నిశ్శబ్దంగా నిద్రపోతోంది.

ఉన్నట్టుండి ఎక్కడినుంచో కోడిపుంజొకటి గొంతు సవరించుకుని 'కొక్కొరోకో' అంది.

ఉదయాన్నే లేచి గంగవరం దారి వివరాలు కనుక్కుని రఘుపతి రోడ్డుమీదికొచ్చాడు. గెస్ట్ హౌస్ నుంచి తనొచ్చిన రోడ్డునే ముందుకెళ్లి పాములేరు బ్రిడ్జి దగ్గర్లో ఉన్న కుడివైపు కాలి బాటవెంట వెళ్లాలని తెలిసింది. కాలిబాట వరకూ బస్సులో వెళ్లొచ్చట.

రఘుపతి నడిచేవెళ్లాలని నిర్ణయించుకున్నాడు.

దారిలో ఓ వ్యక్తి తారసపడి అడిగాడు "ఎక్కడి దాకా సారూ?" అని.

"గంగోరవా, ఆశ్శరమానికా?"

"అవును, ఆశ్రమం అంటే అదేమైనా ప్రకృతి చికిత్సాలయమా?" అడిగాడు రఘుపతి.

తల్లి అక్కడుందని తెలిసినప్పటి నుంచీ ఉద్విగ్నత భరించలేకపోతున్నాడు. ఇల్లూ వాకిలీ ఉండగా తల్లి ఆశ్రమంలో ఎందుకున్నదని.

రఘుపతి చెల్లెలు వినయకి పదో తరగతి చదువు తూండగానే పెళ్లి జరిపించేసింది తల్లి. 'పెద్ద చదువులు చదివిస్తే పెద్ద సంబంధాలు మనం ఎక్కణ్నుంచి తేగలం నాయనా" అంది. కట్నానికి బదులుగా తమ ఇంటిని రాసిచ్చింది తల్లి తదనంతరం వినయకి చెందేలా. వాళ్లేమైనా గొడవచేసి తల్లిని ఇంట్లోంచి వెళ్లగొట్టేరా?

ముందుగా ఇంటికే వెళ్దామనుకున్నాడు.

తల్లి ఇక్కడుండగా తనక్కడికెందుకు వెళ్లడం?

ముందుగా తల్లిని చూడాలనే ఆత్రుత రఘుపతినిలా లాక్కొచ్చింది. ఆశ్రమం అంటే ఏమో అనుకున్నాడు. మరీ ఇంత మారుమూల అటవీ ప్రాంతంలో ఉంటుందని ఊహించలేదు. తల్లి కేదైనా అనారోగ్యం చేసి హాస్పిటల్స్‌లో నయం కాక ఇక్కడికి రావాల్సివచ్చిందా? మనసు పరిపరివిధాల పోతూండగా అవతలి వ్యక్తి అడిగేడు -

"ఏటిబాబూ, మీరేటో పకృతి అన్నారు. అంటే ఏటది?"

"ప్రకృతి చికిత్సాలయం... అంటే...అక్కడ వైద్యం చేస్తారా అని"

"ఆ.. ఆకులూ పసర్లూ గట్రా నూరతుంటారు. ఏటేటో మందులు తయారుసేసి వైద్దికానికెల్లి నోళ్లకి ఇత్తుంటారు"

వెళ్లొస్తానని అతని దగ్గర సెలవు తీసుకున్నాడు.

"రోడ్డు మీద నాలుగడుగులు ముందుకు నడిసి, కుడిసెయ్యి పక్కన డొంకదారిలోకి మల్లండి, ఆ దారి తిన్నగా గంగోరం తీసుకెల్తాది" వెనకనుంచి కేకవేసి చెప్తున్నాడతను.

ఆ కాలిబాట తిన్నగా దట్టమైన అట్టడవిలోకి దారితీస్తోంది. రఘుపతి ధైర్యం తెచ్చుకుని ఆ బాటలో నడక ప్రారంభించాడు.

హఠాత్తుగా సునీత గుర్తుకొచ్చిందతనికి.

సునీతతో తన జీవితానికీ ఈ బాటకీ ఏదో సారూప్యం ఉంది....

తల్లి తనని మొహం చూపించవద్దన్నాక కట్టలు తెంచుకున్న కోపంతో, భరించలేని ఉక్రోషంతో ఇల్లు విడిచి వెళ్లిపోయాడు.

పరీక్ష రాయాలన్న స్పృహే లేదు. ఎలా బతకాలన్న ఆలోచనలేదు. కోపం... కోపం ఒక్కటే నరనరాన్నీ ఆవరించుకుంది. మొహం చూపించవద్దన్న తల్లికి ఆమె బతికుండగా మళ్లీ తన మొహం చూపించడు. ఆమెకదే తగిన శిక్ష.

ఊరి నుంచి తిరిగొస్తూనే తన దగ్గరున్న విలువైన వస్తువులన్నీ అమ్మేశాడు పుస్తకాల్తో సహా.

సునీత ఇంట్లో ఫర్నిచరు, సామాన్లు అమ్మేసి అన్నీ కలిపి సునీత అప్పులు తీర్చేశాడు.

సునీతనీ, పిల్లల్నీ తీసుకుని తన వాళ్లనే వాళ్లెవరికీ కన్పించనంత దూరంగా... రాష్ట్రం వదిలి వెళ్లిపోయాడు.

మొదట్లో తిండి సంపాదించడమే కష్టమైపోయేది. భాష తెలీని ప్రాంతంలో దొరికిన పనల్లా చేశాడు. తొక్కరాని దార్లన్నీ తొక్కేడు.

ఆవేశం పూర్తిగా చల్లారేక తెలిసొచ్చింది జీవితంలో నిలదొక్కుకోవడం ఎంత కష్టమో. ఆర్థిక దుస్థితి మనిషినెంతగా దిగజార్చేస్తుందో, ఎంతటి భీతిని కలగజేస్తుందో.

బొంబాయి వంటి మహానగరంలో బిల్డింగ్ కాంట్రాక్టర్స్ దగ్గర కూలీగా పనిచేశాడు. వంచిన నడుం ఎత్తకుండా పనిచేసి ఒళ్లంతా మట్టికొట్టుకొని ఇంటికొస్తే సునీత నిష్ఠూరంగా చూసే నిరసన చూపు. పెంచడం చేతకాని వాడివి పెళ్లెందుకు చేసుకున్నావ్ అనా? ఆ చూపు చూసి తను నిలువునా నీరయ్యేవాడు.

ఒక ఓదార్పు కోసం, అమ్మ చూపేలాంటి ఆప్యాయత కోసం, నువ్వు మా వాడివి అనే ఒక ధైర్యపు వచనం కోసం ఎంతగా ఎదురుచూశాడు! ఎంత తపించిపోయాడు!

క్రమంగా అర్థం కాసాగింది. తను చేసిన పొరపాటు ఏమిటో, కష్టమో సుఖమో తనతో జీవితం ఆమెకి ఇష్టం అవునో కాదో తను అడగలేదు. ఆమెకి తన పిల్లల భవిష్యత్తు, వాళ్లు ఆకలితో మాడకుండా ఉండడం ముఖ్యమని అర్థమయ్యే సరికి జరగాల్సిందంతా జరిగిపోయింది.

ఆమెకి తను భర్తగా చేరువకాలేక పోయాడు.కనీసం తెచ్చి పెట్టుకున్న ప్రేమనైనా ఆమె తన మీద చూపించలేకపోయేది.

సునీతను సంతోషపెట్టాలని, ఆమె మొహంలో ఆనందాన్ని చూడాలని తనెంత తపనపడ్డాడు! ఎన్నెన్ని సాహసాలు చేశాడు!

దొంగబోర్డులుపెట్టి లేబరు కాలనీలలో వైద్యం చేసాడు. కలవరాని వాళ్లతో చేతులు కలిపి నేర ప్రపంచంతో పరిచయాలు పెంచుకున్నాడు. డబ్బు... డబ్బు... రెండు చేతులా సంపాదించి బీరువాలో నింపిపెట్టాడు. అయినా సునీత మొహంలో ఆనందాన్ని నింపలేకపోయాడు.

ఆమె కొడుకులు ఎదుగుతున్నారు. క్రమంగా వాళ్ల ముగ్గురి ప్రపంచం వేరైంది. తండ్రికాని తండ్రిగా తను మిగిలిపోయాడు.

లోపం తనలోకూడా ఉందేమో, వాళ్లనెప్పుడూ తను ప్రేమగా చేరదియ్యలేకపోయాడు. వాళ్లూ తనకి చేరువ కాలేకపోయారు. ఆ దూరాలలాగే మిగిలిపోయాయి. తను కేవలం డబ్బు సంపాదించే యంత్రంగానే మిగిలిపోయాడు. ముప్పై మూడేళ్లకే విరాగిలా అయ్యాడు.

బాల్యంలో తల్లి తనమీద చూపించినలాంటి అపారమైన ప్రేమ కావాలని గొప్పదాహం మొదలైంది తనలో. అది క్రమంగా పెరిగి పెరిగి ఈ నాటికీ ప్రయాణమైంది.

ఆశ్రమమో మరేదో పల్లో చేరువైనట్టు అర్థమైంది. అడుగులు గబగబా వేశాడు రఘుపతి.

చెరువుగట్టున తేగలు తంపట వేస్తున్న వ్యక్తి, గిరిజనుడు కాబోలు రఘుపతిని రెప్పవెయ్యకుండా చూస్తున్నాడు.

బోర్డులాంటిదేం కన్పించక అతన్ని అడిగేడు "ఆశ్రమం ఇదేనా?"

అవునన్నట్టు తల ఊగించేడతను.

రఘుపతి మనసంతా ఒక్కసారిగా ఉద్వేగంతో నిండిపోయింది.

ఆశ్రమం అన్న పేరేగాని అక్కడ కాషాయ వస్త్రాలు, స్వాములు కన్పించడం లేదు.

రఘుపతి కొంచెం ముందుకు నడిచి తల్లి పేరు చెప్పి ఎంక్వైరీ చేశాడు.

తొమ్మిదేళ్లుగా తన తల్లి ఇక్కడే ఉంటూ వచ్చిందనీ, ఈ మధ్యనే వినయవచ్చి తీసుకెళ్లిందనీ తెలిసింది. రఘుపతిని ఒక్కసారిగా నిస్సత్తువ ఆవరించినట్లైంది. తిరిగి వెనక్కి ప్రయాణమయ్యేడు రఘుపతి.

మిత్రుడు కబురుతెచ్చి నెలరోజులైపోయింది. అంధేరీలో తన ఇంటికి దగ్గర్లో కొత్తగా కాపురం వచ్చిన మూర్తి తన నేటివ్‌ప్లేస్ కాకినాడ వెళ్తున్నాని చెప్తే ఎడ్రస్‌ఇచ్చి, తనక్కడున్నట్టు చెప్పకుండా తన వాళ్లని చూసి రమ్మన్నాడు. అతను తెచ్చిన కబురే తల్లి ఈ ఆశ్రమంలో ఉందని.

అదృష్టవశాత్తు మారేడుమిల్లి నుంచి కాకినాడ వెళ్లే బస్సు అందింది.

సామర్లకోటలో బస్సు మారి ఉప్పాడ చేరుకునే సరికి రాత్రి ఎనిమిది దాటింది. ఊరు ఏ మాత్రం మారినట్టులేదు. తమ వీధి మలుపు తిరుగుతూనే గుండె లయ తప్పింది.

దసేమ్ ఓల్డ్ హౌస్, రెండు గదుల పాత పెంకుటిల్లు, పెచ్చులూడిపోయి, వీధి అరుగుల గచ్చులు పగిలిపోయి.

రోడ్డు ఎత్తు చెయ్యడం వలన కాబోలు ఇల్లు నేల లోపలికి కూరుకుపోయినట్టు కన్పిస్తోంది.

రోడ్డుమీది నుంచి కిందికి దిగి గుమ్మం ముందు నిల్చున్నాడు రఘుపతి.

తలుపు మూసి ఉంది.

మునివేళ్లతో శబ్దం చేశాడు.

కాస్సేపటికి తలుపు తెరుచుకుంది.

ఓణీవేసుకున్న పదిహేనేళ్ల అమ్మాయి గుమ్మం లోపల నిలబడి ప్రశ్నార్థకంగా చూస్తోంది. లోపల పీటమీద కూర్చుని పదమూడేళ్ల అబ్బాయి భోజనం చేస్తున్నాడు. పక్కనే మరోపీట, కంచం, గిన్నెలు చూసి అమ్మాయి భోంచేస్తూ లేచి వచ్చిందని గ్రహించాడు.

"ఇక్కడ... ఈ ఇంట్లో వినయ అనీ..."

"నేను వాళ్లమ్మాయినే, చెప్పండి".

రఘుపతి మొహం నవ్వుతో వికసించింది. "నువ్వు పార్వతి, వాడు రాజా, అవునా?" అన్నాడు గోడకి ఉన్న తన ఫోటో ఫ్రేమ్‌వైపు చూస్తూ.

ఆ అమ్మాయి సంభ్రమంగా ఫోటోనీ రఘుపతినీ మార్చి మార్చి చూసి గోడ పక్కనున్న కుర్చీని ముందుకులాగి "మామయ్యా...మీరు... మీరేనా? కూర్చోండి" అంది కంగారుగా.

పీటమీదున్న అబ్బాయి చేతిలోని ముద్దనలాగే పట్టుకుని తినడం మరచిపోయి చూస్తున్నాడు.

"బుల్లిబుల్లి పిల్లలు పెద్దవాళ్లయ్యారే" అతని మాటల్లో ఆప్యాయత పొంగిపొర్లింది.

పిల్లలిద్దరూ చూడముచ్చటగా ఉన్నారు.

"చదువుకుంటున్నారా?"

"ఆ... నేను టెన్త్, తమ్ముడు ఎయిత్ క్లాస్.

"అమ్మా వాళ్లూ ఏరి?" అన్నాడు లోపలి గదిలోకి చూస్తూ, తల్లికీ, వినయకీ తనమీద కోపం పోలేదనే అతని అభిప్రాయం.

"మీకు తెలీదా, అమ్మమ్మకి ఉన్నట్టుండి చాలా సుస్తీ చేసింది.

"ఎప్పుడు? ఎక్కడ?" ఆతృతతో లేచి నిల్చున్నాడు రఘుపతి.

"అప్పుడే వారం అయ్యింది. కాకినాడలో జాయిన్ చేసారు. కొన్నాళ్లు హాస్పిటల్లో ఉంటే తగ్గిపోతుందన్నారట డాక్టర్లు. సాయంకాలం కేరియరుపట్టుకుని వెళ్లేరు మానాన్న. ఇప్పుడో కాస్సేపట్లోనో వస్తారు. కూర్చోండి మామయ్యా"

"ఇప్పుడు బస్సులుంటాయిగా, నేను వెంటనే కాకినాడ వెళ్తాను" అన్నాడతను.

'అదసలే గవర్నమెంటు హాస్పటలు, మీరిప్పుడెళ్లినా లోపలికి రానివ్వరు. రేపు ఉదయం మా నాన్నతో వెళ్దురులెండి. ముందు కాళ్లు కడుక్కోండి. వడ్డించేస్తాను" పార్వతి వంటింట్లోకెళ్లి చెయ్యి కడుక్కుని, చెంబుతో నీళ్ల పట్టుకొచ్చింది.

మౌనంగా ఉన్న రఘుపతి మొహాన్ని చూసి "భయపడకండి మామయ్యా, అమ్మమ్మకి నయమౌతుందిలే" అంది, ఆ అమ్మాయి తెచ్చిపెట్టుకున్న పెద్దరికానికి రఘుపతికి ముచ్చటేసింది.

రాత్రి ఆఖరి బస్సులో కాబోలు వినయ భర్త వచ్చాడు. అతను ఇన్నేళ్ల తర్వాత అనుకోకుండా హఠాత్తుగా రఘుపతిని చూడడం వల్ల ఆశ్చర్యపోయినా, ఆ విషయం బైటపడకుండా తనని తనే తమాయించుకుంటున్నట్టు కన్పించేడు.

భోజనం చేసి పడుకున్నాడన్న మాటేకాని రఘుపతి కంటిమీదికి కునుకే రాలేదు. ఆ ఇంటిని చూస్తూ ఉంటే అతనికి బాల్యం మళ్లీ తిరిగొచ్చినట్టే ఉంది. ఆ గోడల్ని చేతుల్తో తాకి తానొచ్చేనని చెప్పాలన్పిస్తోంది. మూలపడిన నేతమగ్గాన్ని నిమరాలని ఉంది. తల్లీతండ్రీ పడుగూ పేకలై నేసిన చీరల అందాల్ని కళ్లారా చూడాలని ఉంది.

తెల్లగా తెల్లవారింది. వినయ భర్తతో బాటు ఉదయం తొమ్మిదికల్లా హాస్పిటలుకి చేరుకున్నాడు రఘుపతి.

అప్పుడే శుభ్రం చేసినట్టున్నారు వార్డంతా డెట్టాల్ వాసనతో నిండి ఉంది. స్టూడెంటుగా తను ఎన్నెన్నో కలలుకంటూ తిరిగిన వార్డులు ఇవి. ఆ మూలగా ఉన్న మంచం దగ్గర

ఆగాడు వినయ భర్త, నాలుగైదు మంచాల కివతల నిలబడి పోయిన రఘుపతిని చూపిస్తూ ఏదో చెప్తున్నాడు.

రఘుపతికి తన గుండె చప్పుడు చెవుల్లో ప్రతి ధ్వనిస్తున్నట్టనిపిస్తోంది.

వెనక్కి తిరిగి కబోర్డ్‌లో ఏదో సర్దుతున్న వినయ ఇటు తిరిగింది. నమ్మలేనట్టు చూస్తోంది.

రఘుపతి కళ్లు మంచం మీద నిస్ప్రాణగా పడుకున్న తల్లిని చూశాయి.

ఎంత మార్పు! ఎవరూ చెప్పకపోతే గుర్తు పట్టలేనంతగా మారిపోయింది. చిక్కి శల్యమైంది.

ఎంత వృద్ధురాలైపోయింది తన తల్లి!

రఘుపతి గబగబా నడిచి రెండంగల్లో తల్లి మంచాన్ని చేరుకున్నాడు. మంచం పట్టెని పట్టుకుని వంగి తల్లి మొహంలోకి చూశాడు.

అరమూతలు పడి ఉన్న ఆ కళ్లను చూడగానే అతనికి ఏం జరగబోతోందో అర్థమైపోయింది.

అతని కన్నీళ్లు జలజలా రాలి తల్లి మొహం మీద పడ్డాయి. మంచం మీద పక్కనే కూర్చుని ఆమె చేతిని గట్టిగా పట్టుకున్నాడు. అతనికి దుఃఖం కడుపులోంచి ఎగదన్నుకు వస్తోంది.

పరిసరాల్ని మరచిపోయి రోదిస్తున్నాడతను.

వినయ మంచాన్ని చుట్టి వచ్చి అన్నగారి భుజం మీద చెయ్యి వేసింది ఓదార్పుగా.

"నా మీద కోపం పోయిందని చెప్పమ్మా" అంటున్నాడు రఘుపతి.

"అమ్మకి నీమీద అసలు కోపం ఉంటే కదా, అదిపోడానికి, ఆ రోజైనా.. నిన్ను డాక్టరుగా చూడాలనే తన ఆశనెరవేరదేమో అని, సంసార జంఝూటంలో పడి నీ చదువుని చెడగొట్టుకుంటావేమోనని భయంతో అంతకోపం తెచ్చుకుంది.

అమ్మ కోపం ఎంతసేపు? తాటాకు మంటలాంటిది. మర్నాటికే చల్లారిపోయింది.

నువ్వెళ్లిన రెండో రోజే అమ్మా నేనూ నిన్ను వెతుక్కుంటూ నీరూంకి వచ్చాం. అప్పటికే నువ్వు ఊరు విడిచి వెళ్లేవని తెల్సింది.

నెలా రెండు నెలలు గడిచినా నీకబురు తెలీక పోయేసరికి నిజంగానే చాలా భయపడ్డాం. అది మొదలు అమ్మ నిన్ను తల్చుకుని ఏడవని రోజుండేది కాదు. నీకోసం ఎంతెంతో వెతికించాం. ఎన్నెన్నో ఆరాలు తీశాం. నీ జాడ తెలీకపోయేసరికి పిల్లల బాధ్యత మొత్తం అమ్మమీద పెట్టేసు.

పార్వతిని, రాజాని చూసైనా నిన్ను కొంత మరచిపోతుందనుకున్నాను. అలా జరగలేదు. తనే నీ భవిష్యత్తుని పాడుచేశాననే అపరాధభావం ఒకటి బాగా పెంచుకుంది. ఎక్కడకూర్చుంటే అక్కడే ఉండిపోయేది. పిలిచి పెడితేగాని తిండి కూడా తినాలనే ధ్యాస మరచిపోయింది.

ఇటు ఇద్దరు చంటి పిల్లల్తో బాటు అమ్మని కనిపెట్టుకుని ఉండడం నావల్ల కాలేదు. అందుకే, గంగవరం ఆశ్రమంలో ఇలాంటివాళ్లకి ఎంతో ప్రశాంతంగా ఉంటుందని విని అక్కడికి తీసుకెళ్లి దిగబెట్టి వచ్చాం. అది మొదలు, చూడాలన్పించినప్పుడల్లా మేం వెళ్లి చూడాల్సిందేకాని, ఎన్నిసార్లు ప్రయత్నించినా పదిరోజులుండి వెళ్దువుగాని రమ్మంటే వచ్చేదికాదు.

ఈ మధ్య తరచుగా తెలివితప్పి పడిపోతోందని ఆశ్రమం వాళ్లు కబురు చేస్తే వెళ్లి తీసుకుని వచ్చాం. వచ్చినప్పట్నుంచీ ఇదిగో ఇలాగ హాస్పటలు మంచం మీద... గొంతు గద్గదికం కాగా చెప్పడం ఆపి కళ్లొత్తుకుంది వినయ.

"అయినా అన్నయ్యా, అన్నానని కోపం తెచ్చుకోకు కానీ, చిన్నమాటకు అంత పౌరుషపడి అయిన వాళ్లని వదులుకుని పోతార్రా నాకు తెలీకడుగుతాను. కొడుకువి కాబట్టి నువ్వు అలా తెగతెంపులు చేసుకుని వెళ్లిపోగలిగేవు. ఆడదానిగా చేస్తే నేనలా చెయ్యలేను".

వినయ కోప్పడ్డంలో న్యాయముంది.

ఇంకా ఇంకా కోప్పడి తిడితే బావుండును. తన మనసు కాస్త చల్లబడును.

రఘుపతి కర్చీఫ్‌తో కళ్లొత్తుకుంటూ తల్లినే చూస్తున్నాడు. ఒక్కసారి కళ్లు తెరిచి చూస్తే బావుండును. ఆమె కాళ్లను తన కన్నీళ్లతో కడిగేవాడు.

అవును, కొడుకు కాబట్టే ఇన్నాళ్లూ తను రాయిలా ఉండిపోగలిగేడు.

తొమ్మిది నెలలు మోసినందుకైనా ఆ తల్లి రుణాన్ని తీర్చుకునేలా ప్రవర్తించలేదు.

ఒక్కసారి కళ్లు తెరిచి తనని చూస్తే ఇకపై అలా జరగదనీ, ఇంకెప్పుడూ ఆమెని వదిలి వెళ్లననీ చెప్పాలని ఉంది.

సునీతకీ, పిల్లలకీ వీడ్కోలు చెప్పి రాత కోతలన్నీ పూర్తిచేసి వచ్చేశానని చెప్పాలని వుంది.

ఆ రాత్రికే, కన్ను విప్పి రఘుపతిని చూడకుండానే కన్నుమూసిందావిడ. కడుపున పుట్టిన రుణాన్ని ఇలా తీర్చుకోడానికికొచ్చాడా తను? రఘుపతి దుఃఖానికి అంతంలేక పోయింది. అపరాధ భావంతో కుమిలి కుమిలి ఏడ్చేడు.

కర్మకాండలన్నీ ముగిశాయి.

రోజంతా సముద్రపు ఒడ్డునే కూర్చుంటున్నాడు రఘుపతి. ఆ సముద్రపు ఘోషా, తన హృదయ ఘోషా ఒక్కలాగే అన్పిస్తున్నాయతనికి.

ఓ రోజు ఉన్నట్టుండి వినయతో "వినయా! నేను గంగవరం ఆశ్రమంలో ఉండి పోవాలనుకుంటున్నాను" అన్నాడు.

వినయ బిత్తరపోయింది.

"అదేంట్రా అన్నయ్యా, ఏమైంది నీకు?" అని మాత్రం అనగలిగింది. దుఃఖంతో గొంతు నిండుకు రాగా మాట్లాడలేకపోయింది.

"సునీతనీ, పిల్లల్నీ ఏం చేస్తావు?" అంది ఎలాగో తెరిపినపడి.

"వాళ్లు నా పిల్లలు కారు, అయినా వాళ్లకిప్పుడు నా అవసరం లేదు. సునీతకీ లేదు. ఆమెని చూసుకోడానికి ఇద్దరు కొడుకులున్నారు" అన్నాడు.

"అన్నయ్యా, కాస్త ఆలోచించు, తొందరపడి నువ్వు తీసుకున్న ఒక నిర్ణయంతో అమ్మకు జీవితాంతం శాంతి లేకుండా చేశావు. ఇప్పుడు మరో తొందరపాటు నిర్ణయంతో సునీతని బాధించకు. తల్లిదండ్రుల్లాగే బిడ్డలు కూడా స్త్రీల జీవితాల్లోంచి కొంతకాలం తర్వాత విడిపోతారు.

జీవితాంతం కలిసిమెలిసి తోడునీడగా ఉండాల్సినవాడు భర్త ఒక్కడే. సునీత కొడుకులకి పెళ్ళిళ్లై భార్యలొస్తే వాళ్ల జీవితాలు వేరవుతాయి. సునీత మళ్లీ ఒంటరిదైపోదా? ఎందుకురా మీరు ఆడవాళ్ల మనసుల్ని అర్థం చేసుకోరు?" వినయ విసురుగాలేచి వంటింట్లోకెళ్లింది.

పదినిమిషాల తర్వాత రఘుపతి వంటింటి గుమ్మంలో నిలబడి కంపిస్తున్న గొంతుతో ఇలా అన్నాడు. "వినయా! అమ్మతో చెప్పుకోవాలని ఇంత దూరం వచ్చాను. ఇంతకాలం నన్ను దహించేసిన నా ఆర్తిని నీకైనా చెప్పుకోకపోతే నా మనసు బరువుతీరదు. సునీతను పెళ్లాడగలిగేను కాని ఆమె కొడుకుల్ని ప్రేమించలేకపోయాను. ఆ కొడుకుల కారణంగా సునీతనైనా మనస్ఫూర్తిగా ప్రేమించానా అన్నది గొప్ప సంశయం.

ప్రేమ రాహిత్యం నన్ను వెంటాడిందిన్నాళ్లూ. వాళ్లు నా రక్తం పంచుకుని పుట్టినవాళ్లు కారనే వ్యథ నన్ను నిలవనీయడం లేదు.

అందుకే... నేను తిరిగి ఆ కాంక్రీటు ప్రపంచంలోకి వెళ్లదలచుకోలేదు. అమ్మ నివసించిన ఆ అడవీ, ఆశ్రమం అగరు ధూపమంత పవిత్రమైనవి. నా శేష జీవితాన్నక్కడే

గడిపేయాలని నిశ్చయించుకున్నాను. అక్కడుంటే కన్నతల్లి జ్ఞాపకాలైనా మిగులుతాయి. అమ్మలాంటి అడవి నాకు కూడా ఆశ్రయమివ్వకపోదు.

గదిలోకెళ్లి సూట్‌కేస్ సర్దుకుంటున్న రఘుపతిని వినయ వారించలేదు. రఘుపతి బైటికి నడవబోతూండగా "అన్నయ్యా, ఈ ఒక్క మాటా విని వెళ్లు. ఇది ఈ సమయంలో ముఖ్యంగా నీకు తెలియాల్సిన విషయం" అంది.

రఘుపతి ప్రశ్నార్థకంగా చూసాడు.

"అమ్మకు నువ్వు రక్తం పంచుకుని పుట్టిన కొడుకువి కావు. చాన్నాళ్లు సంతానం కలగక జనరలు హాస్పిటలు మెటర్నిటీ వార్డులో ఏ తల్లో కనివదిలేసిన నిన్ను తెచ్చి పెంచుకుందట... నమ్మలేకపోతే అమ్మ ట్రంకు పెట్టి తెరిచి చూడు" తాళం చెవి గడపమీద పెట్టి వెళ్లిపోయింది వినయ.

రఘుపతి నిర్ఘాంతపోయి నిలబడిపోయాడు. అవునా...?

ఎవరో తెలీని అనాథను తన తల్లి ఎంతగా ప్రేమించింది! తను దూరంగా వెళ్లిపోతే మానసిక వేదనతో ఎంత క్రుంగి కృశించిపోయింది! ప్రయత్నిస్తే సునీత కొడుకుల్ని తను ఎందుకు ప్రేమించలేడు? వాళ్లింకా చదువులు పూర్తికాని కుర్రాళ్ళు... ఒక దృఢమైన నిర్ణయానికి వచ్చి బైటికి నడిచాడు.

రఘుపతి సామర్లకోట డిపోలో బస్సు దిగేసరికి మారేడుమిల్లి బస్సు కదలడానికి సిద్ధంగా ఉంది. కాని, రఘుపతి ఆ బస్సువైపు నడవకుండా ఎడమ వైపుగా నడిచి రైల్వేస్టేషనులోకి వెళ్లేడు.

రఘుపతి వెళ్లిన పదిహేను రోజుల్లో వినయ భర్త పేర ఉత్తరం వచ్చింది.

"నేత పనిని తిరిగి ప్రారంభించమనీ, పెట్టుబడితో బాటు కొత్త కొత్త డిజైన్లు తను పంపిస్తాననీ, నేతపనివాళ్లంతా ఒక సొసైటీగా ఏర్పడి చీరలునేసి అందివ్వగలిగితే మార్కెటింగ్ వర్క్ తను చూసిపెడతాననీ, త్వరలోనే ఊరిని తిరిగి పూర్వ వైభవానికి వచ్చేలా చేద్దాం అనీ"

వినయ భర్త ఈ విషయం అందరికీ చెప్పడానికి ఉత్సాహంగా వెళ్లేడు.

*స్వాతి, ఫిబ్రవరి, 2004*